క్లుప్తంగా

విజయరాజును కలిసిన నాయకులు



విజయరాజుతో శ్రీనివాసపురం నాయకులు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గం ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. గురువారం విజయరాజును జంగారెడ్డిగూడెంలోని జెట్టి గురునాథరావు నివాసం వద్ద పార్టీ శ్రీనివాసపురం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిలో శ్రీనివాసపురం సీనియర్ నాయకులు పాల్నాటి ప్రభాకర్, పాల్నాటి శ్రీనివాసరావు, సిర్రా రాజేష్, వసంతాటి అశోక్, సీతారాములు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు చేయూత



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్, వాకింగ్ స్టాండ్, చేతి కర్రలను అందించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గడ్డం రాంబాబు జ్ఞాపకార్థం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలాజీ నగర్ నివాసి శ్రీనివాసరావుకు వాకింగ్ స్టాండ్, ఎల్-4 కాలనీ నివాసి మల్లికార్జునరావుకు వీల్ చైర్, చేతికర్రలను అందించామన్నారు. గెడ్డం రాంబాబుకు మృతి చెందడంతో గతంలో రోటరీ క్లబ్ ద్వారా ఆయనకు అందించిన వీల్‌చైర్‌ను మరో వికలాంగ యువకుడు మల్లికార్జునకు అందించినట్టు చెప్పారు. సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: వివిధ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్‌ల మరమ్మతుల నిమి త్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్కవరం సబ్‌స్టేషన్‌పరిధిలో గుర్వాయిగూడెం, అమ్మపాలెం, నిమ్మలగూడెం ఫీడర్‌లు, లక్కవరం, దేవుపల్లి, పుట్లగట్లగూడెం గ్రామాలకు, మధ్యాహ్నం 2 నుంచి 5.30 గంటలవరకు లక్కవరం, దేవుపల్లి, పుట్లగట్లగూడెం గ్రామాలకు, జంగారెడ్డిగూడెం టౌన్ ఫీడర్ పరిధిలో కాలేజ్ రోడ్డు, సాలిపేట, ఉప్పలమెట్ట, కొడాలివారి వీధి, శ్రీనివాసపురంరోడ్డు, సుబ్బంపేట ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: రాజుపోతేపల్లి, టి.నరసాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటగల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

పోలవరం ఫీడర్‌లో..

పోలవరం రూరల్: పోలవరం ఫీడర్ పరిధిలోని పోలవరం, రామయ్యపేట, కృష్ణారావుపేట గ్రామా ల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాల్లో..

వేలేరుపాడు: జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

చింతలపూడిలో..

చింతలపూడి : శంఖుచక్రపురం, టి .నరసాపురం, రాఘవపురం, శెట్టివారిగూడెం ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, ఎర్రగుంటపల్లి 24 గంటల ఫీడర్, ఏజీఎల్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

రంగాపురం సెక్షన్ పరిధిలో..

లింగపాలెం: సింగగుడెం ఫీడర్‌కు ఈనెల 11, 12 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు.

కొత్త ఏబీటీ ఏజెంట్లకు ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: స్థానిక డిపో పరిధిలో గల బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు మండలాల నుంచి ఏపీఎస్ఆర్టీసీ ఏబీటీ ఏజెంట్‌గా చేయుటకు ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఈ ఏజెంట్లు ఆర్టీసీ బస్‌లలో కార్గో బుకింగ్, రిజర్వేషన్ సర్వీసులకు టిక్కెట్లు బుకింగ్ చేసి ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసుల్లో భాగం కాగలరని జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ తెలిపారు.

చిట్టడవుల్లా ఖాళీ ప్రదేశాలు

కొయ్యలగూడెంలో స్థానికులకు ఇబ్బందులు



కొయ్యలగూడెం నడిబొడ్డున జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని చిట్టడవిని తలపిస్తున్న ప్రాంతం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని ప్రధాన వీధులు, నడిబొడ్డున ఉండే ప్రాంతాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో విష సర్పాలు, పురుగులు, కీటకాలు, హానికరమైన జంతువులు సంచరిస్తున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి ఎదురుగాఉన్న ప్రాంతంలో మొక్కలు పెరగడం వల్ల హాస్పిటల్లోకి విషసర్పాలు ప్రవేశిస్తున్నాయని రోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ప్రధాన రహదారి మొదలుకొని మండల పరిషత్ కార్యాలయం, బాలికల హైస్కూల్, అగ్రికల్చర్ ఆఫీస్, పంచాయతీ కార్యాలయం ఇలా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాలు అడవిని తలపించేలా ఉన్నాయి. రాత్రి వేళల్లో విషసర్పాలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండడంతో ఒక్కోసారి పెంపుడు జంతువులు గందరగోళానికి గురై పారిపోతున్నాయి. పగలే ఇళ్ల ప్రాంగణాలలోకి విష సర్పాలు ప్రవేశిస్తుండడంతో మహిళలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. సొమ్ములు బ్యాంకులలో డిపాజిట్లు చేసే దానికంటే స్థలాలు కొనుగోలు చేసి ఖాళీగా ఉంచి ఆపై అమ్మకం సాగించడం వల్ల ఎక్కువగా లాభం వస్తుండడంతో ధనవంతులు స్థలాల కొనుగోళ్లపై అత్యంత ఆసక్తి కనబరుస్తున్నారు. మరుగుగాఉన్న కొన్ని ప్రాంతాల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలుగా ఉంచి కట్టడాలు నిర్మించని ప్రాంతాలు చిట్టడివిగా మారడానికి కారణమయ్యాయని చెబుతున్నారు. పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్య లు తీసుకోవాలని తుప్పలను తొలగించడం, ఖాళీ స్థలాలుగా ఉంచుకున్న యజమానులపై చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పన్నులు విధించాలి



పిల్లల్ని ఇళ్ల ప్రాంగణంలో వదిలి వంటగదిలో పనులు నిర్వహించుకోవడానికి కూడా భయపడాల్సి వస్తుంది. ఇంటి పన్నులతో పాటు ఖాళీ స్థలాలపై కూడా పంచాయతీ పన్నులు విధించాలి. ఖాళీగా స్థలాలను ఉంచి చిట్టడవులు పెరగడానికి కారణమయ్యే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

– యలమర్తి కామేశ్వరి, డ్వాక్రా గ్రూపు లీడర్

స్థానికులకు సంకటం



స్థలాలను లేఅవుట్లుగా వేసి మంచి ధర వచ్చేవరకు ఉంచి వ్యాపారాలు చేస్తున్న వారు ఎక్కువయ్యారు. పెట్టిన పెట్టుబడికి నాలుగింతలుగా వస్తుండడంతో స్థలాలు కొనుగోలు చేసి ఖాళీగా వదిలేస్తుండడం పరిసర ప్రాంత వాసులకు సంకటంగా మారింది. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి.

– చిటికెన లక్ష్మి, గృహిణి



కొయ్యలగూడెంలోని ఒక రోడ్డు కనపడకుండా పెరిగిన మొక్కలు



కొయ్యలగూడెంలోని బిఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతంలో పెరిగిన మొక్కలు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఏలూరు టౌన్: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలూరు సైబర్ సెల్ సీఐ ఎం దాసు, ఎస్సై వల్లీపద్మ అన్నారు. ఏలూరు అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో సైబర్‌నేరాలు పెరిగాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రజలు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాతో ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిషింగ్, లింక్ స్కామ్స్, ఫేక్‌కాల్స్ వంటివాటిని గుర్తిస్తూ వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురయ్యేవారు ఎక్కువ అయ్యారని, సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్, టెలీగ్రామ్ ఇతర సోషల్ మీడియాల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని వచ్చే ప్రకటనలను నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకున్నా, వేధింపులకు గురైనా వెంటనే 1930కు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని సైబర్‌సెల్ సీఐ దాసు చెప్పారు. సదస్సులో ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ ఉదయ్‌భాస్కర్, ఆర్ఎస్ఐ నరేంద్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయిని వి.స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులు



1. కుమార్తె సౌజన్యతో గజ్జల సరస్వతి, 2. కుమార్తెలతో యేసయ్య, 3. కుమార్తె శార్వాణితో వసంత విజయ, 4. కుమారుడు సాయితో ధనలక్ష్మి, 5. కుమారుడు వేదార్ష సాహిత్‌తో రాంబాబు

- ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్న వైనం
- స్ఫూర్తిగా నిలిచిన కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు. తమ పిల్లలను పనిచేస్తున్న పాఠశాల్లోనే చదివిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలోనే తాము విద్య నేర్చుకొని ఉపాధ్యాయులుగా స్థిరపడ్డామని చెబుతున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి. పరింపూడి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గజ్జల సరస్వతి తన కుమార్తె సౌజన్యను పదో తరగతి అదే పాఠశాలలో చదివిస్తున్నారు. కొయ్యలగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు చింతపల్లి ఏసయ్య తన ఇద్దరి కుమార్తెలు నిహారిక, (ఆరో తరగతి, బాలికల హైస్కూల్), ప్రజ్వల (నాలుగో తరగతి ఎంపీపీ స్కూల్)ల్లో చదివిస్తున్నారు. బాలికల హైస్కూల్లో ఉపాధ్యాయురాలు కుంజం వసంత విజయ తన కుమార్తె శార్వాణిని అదే స్కూల్లో ఏడో తరగతి చదివిస్తున్నారు. సరిపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి అదే పాఠశాలలో తన కుమారుడు జి.సాయిశరణ్‌ను నాలుగో తరగతి చదివిస్తున్నారు. నరసన్నపాలెం ఎంపీపీ స్కూల్లో ఉపాధ్యాయుడు కటారి రాంబాబు తన కుమారుడు వేదార్ష సాహిత్‌ను మూడో తరగతి చదివిస్తున్నారు. పరింపూడి బాలికల హైస్కూల్‌కి చెందిన విద్యార్థి తోట భార్గవి లక్ష్మీ దుర్గ గత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచారు. అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణంగా నిలిచింది అని బాలికల హైస్కూల్ ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ ఆదర్శ ఉపాధ్యాయులను పలువురు అభినందిస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ పిల్లలను గవర్నమెంట్ స్కూళ్లలో చదివించడానికి ముందుకొస్తే ప్రజల్లో ప్రభుత్వ విద్యాసంస్థలపై మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

అర్హుల జాబితా ప్రదర్శన

గణపవరం: మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 4814 మంది రైతుల తుది అర్హుల జాబితాను గ్రామ సచివాలయాలవద్ద ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. అర్ధవరం సచివాలయం వద్ద అర్హుల జాబితాను ప్రదర్శించారు. అర్హత కలిగి జాబితాలో పేరు లేకపోతే రైతులు వెంటనే రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ట్యాంక్‌కు కొత్త మోటార్

ఏలూరు (టూటౌన్): దెందులూరు సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు గోదావరి జలాలను పంపింగ్ చేసే 150 హెచ్‌పీ మోటర్‌ను బిగిస్తున్నామని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ ఎంఈ సురేంద్రబాబు తెలిపారు. గురువారం సాయంత్రం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును వారు సందర్శించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు పాకలపాటి

ద్వారకాతిరుమల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని రామన్నగూడెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు పాకలపాటి తాగ్య భీమేశ్వరరావు కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించారు. రామన్నగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భీమేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హాజరు ఎక్కువ శాతం ఉన్న విద్యార్థులకు బహుమతులను అందించారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన తల్లితండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. అశోక్ నగర్ ఎలిమెంటరీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడారు. ఛత్రపతి శివాజీ ప్రభుత్వ కళాశాలలో ఈరోజు గురుపౌర్ణమి సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంచి పేరు తేవాలి

పోలవరం రూరల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సూచించారు. పోలవరం మండలం గూటాల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. కోండ్రుకోట పునరావాస కేంద్రం పాఠశాలలో ఐసీడీఎస్ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారని ప్రధానోపాధ్యాయుడు ఉప్పే మహాలక్ష్మయ్య తెలిపారు.



జంగారెడ్డిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



ద్వారకాతిరుమల : రామన్నగూడెంలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న భీమేశ్వరరావు



పోలవరం రూరల్ : గూటాల హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

బహుమతుల ప్రదానం

బుట్టాయగూడెం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో గ్రామ పెద్దలు కరాటం రెడ్డినాయుడు ఆధ్వర్యంలో 2024 – 25 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు సుమారు రూ.75 వేల నగదును బహుమతు అందించారు. ఈ నగదును మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తలిదండ్రుల సమావేశం నిర్వహించారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

కామవరపుకోట: విద్యార్థుల భవిష్యత్‌కు కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా అవసరమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. సర్పంచ్ కె.అనూష భాగ్యరాజు, ఎంఈఓలు సుబ్బారావు, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

పీటీఎం సమావేశాలు

కొయ్యలగూడెం: విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాల వల్ల విద్యార్థులు విద్యలో రాణించడానికి ప్రతిభ మెరుగుపరచుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందని డీఎల్‌డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.రాజు పేర్కొన్నారు. బయ్యన్నగూడెం జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ జె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలను పరింపూడిలో ఎంపీపీ గంజిమాల రామారావు సందర్శించారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పాల్గొన్నారు. బయ్యన్నగూడెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బయ్యనగూడెంలను సందర్శించి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కుంతలగూడెంలో ఈడూరి రాజకుమార్ అధ్యక్షతన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఆత్మీయ సమ్మేళనం

లింగపాలెం: రంగాపురం హైస్కూల్లో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



బుట్టాయగూడెం : కండ్రికగూడెంలో బాబాకు అభిషేకం చేస్తున్న బాలరాజు



ద్వారకాతిరుమల : సాయిబాబాకు హారతులిస్తున్న పురోహితుడు



కొయ్యలగూడెం : శాకాంబరి అలంకరణతో కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం : దత్తాత్రేయుడు

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంత పలు గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సాయిబాబా మందిరాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తులతో పోటెత్తాయి. బుట్టాయగూడెం, కేఆర్‌పురం, కండ్రికగూడెం, దొరమామిడి గ్రామాల్లో షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కండ్రికగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బాబావారికి క్షీరాభిషేకం చేశారు. రాత్రి స్వామివారి పల్లకి సేవా నిర్వహించారు. మండల నలుమూలల నుంచి భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బాబాకు ఆలయ నిర్వాహకుడు పుప్పాల మురళీ, తదితరులు ప్రత్యేక అభిషేకాలు, పూజాధికాలను నిర్వహించారు. మందిరం వద్ద భక్త సమాజం సభ్యులు భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: గురుపూజోత్సవ సందర్భంగా గురువారం కన్నాపురం గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ అనిపెద్ది రామం దంపతులను సన్మానించామని చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు గొలిసెట్టి వాసు తెలిపారు. రామం ఉచితంగా ఎంతోమంది విద్యార్థులకు స్మార్తం నేర్పించడంతోపాటు పురోహితులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. బొమ్మ బాబు, కట్టా సత్యనారాయణ, చిరవూరు శ్రీనివాస్, సుంకర ప్రసాద్, కొర్లేపల్లి వెంకటేశ్వరరావు, గంటా జానకి రమణ, తవ్వ గోపాల్, వీరవరపు నివాసు, చిటికెన రమేష్ పాల్గొన్నారు.

శాకాంబరిగా కనకదుర్గమ్మ

ఆషాడ మాసం సందర్భంగా కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్లోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ శుక్రవారం శాకాంబరి దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివానంద ఆచార్యులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పండ్లు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు.

జంగారెడ్డిగూడెంలో గురుపౌర్ణమి పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, కాగాడ హారతి తదితర పూజలు నిర్వహించారు. పాతబస్టాండ్, సుబ్బంపేటలో ఉన్న సాయిబాబా ఆలయాల్లో, సుబ్బంపేట సాయిబాబా ఆలయ ఉపాలయమైన దత్తాత్రేయ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాతబస్టాండ్ సాయిబాబ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. మండంలోని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఉపాలయంలో దత్తాత్రేయ స్వామికి గురువారం, గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: మండలంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం, తదితర గ్రామాల్లో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు, కాగడా హారతులు, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాబా వారిని దర్శించుకున్నారు.



కొయ్యలగూడెం : కన్నాపురంలో పురోహితులను సత్కరిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం : పాతబస్టాండ్ షిర్డీ సాయిబాబాను పూజిస్తున్న భక్తులు

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



చింతలపూడి స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

చింతలపూడి : స్థానిక ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేఎస్ ప్రభు కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నవోదయం 2.0 విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. సారా రహిత జిల్లాగా మార్చడానికి గట్టి నిఘా పెట్టామన్నారు. సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇస్లావతు రాముపై పీడీ యాక్ట్ నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.